ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ప్రతి గదిలో సీసీ కెమెరాల ఏర్పాటు
- లైవ్ స్ట్రీమ్ ద్వారా పర్యవేక్షణ





రాయదుర్గం: బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉరవకొండ: సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

ఉరవకొండ/రాయదుర్గం టౌన్: ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది.. బుధవారం నుంచి మొదలు కానున్న పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ పేపర్లతో పరీక్షలు మొదలు కానున్నాయి. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ఇంటర్ పరీక్షలు రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరగనున్నాయి. 8.30 నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. 9 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళి, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్, మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు పేర్కొన్నారు.

14 పరీక్ష కేంద్రాలు

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో 14 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. పరీక్షలకు 6,531 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 3,209 మంది, రెండో సంవత్సరం 3,322 మంది ఉన్నారు.

కాగా జిల్లా ఇంటర్ బోర్డు అధికారుల ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో ప్రతి గదికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు లైవ్‌స్ట్రీమ్ ద్వారా పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడం నిషేధించారు.

జిరాక్స్ సెంటర్ల మూత

పరీక్షల నేపథ్యంలో జిరాక్స్ సెంటర్లపై ఆంక్షలు విధించినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

క్లస్టర్ వివరాలు ఇలా..

నియోజకవర్గం	మొదటి సంవత్సరం విద్యార్థులసంఖ్య	రెండో సంవత్సరం విద్యార్థుల సంఖ్య	పరీక్ష కేంద్రాలు
రాయదుర్గం	1,293	1599	6
ఉరవకొండ	688	521	3
కళ్యాణదుర్గం	1,228	1,242	5

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు



ఇంటర్ పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కేంద్రాల్లో విద్యార్థులకు అన్నీ వసతులు కల్పించాం.

– మమత, ప్రిన్సిపాల్, ఇంటర్ బాలుర, బాలికల కళాశాల ఉరవకొండ

ఎమ్మెల్సీ ఎన్నికల విజయవంతంపై అభినందనలు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొని విజయవంతం చేసేలా కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ ముఖ్య నాయకులందరికీ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీలో నిలిచిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారని ప్రశంసించారు. టీడీపీ నాయకులు పంపకాల్లో తేడా వచ్చి రోడ్డెక్కితే.. నిస్వార్థంగా ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు పాటుపడ్డారని కొనియాడారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తనూ గుండెల్లో పెట్టుకుంటామన్నారు. ఇదే ఊపును వచ్చే సార్వత్రిక ఎన్నికల వరకూ కొనసాగించాలన్నారు. పార్టీ క్యాడర్ సమష్టిగా కదిలితే టీడీపీ అడ్రస్ గల్లంతు కావడం తథ్యమన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయం నమోదు చేస్తామని విప్ ధీమా వ్యక్తం చేశారు.

అనాథలకు 'వైఎస్సార్ బీమా' పంపిణీ



రూ.2 లక్షల బ్యాంకు డిపాజిట్ రసీదును అందజేస్తున్న సచివాలయ కన్వీనర్లు

డి హీరేహాళ్(రాయదుర్గం): అమ్మ, నాన్నను కోల్పోయి అనాథలైన ముగ్గురు పిల్లలను ఆదుకునేందుకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కృషి చేశారు. వివరాలు.. డి హీరేహాళ్ మండలం గొడిశెలపల్లి గ్రామానికి చెందిన బోయ శకుంతలమ్మ, మంజునాథకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల తల్లి మరణించడంతో పెద్ద కుమార్తె బోయ ప్రేమ టైలరింగ్ చేస్తూ తండ్రి, ఇద్దరు తమ్ముళ్లకు చేదోడైంది. వారి కష్టాన్ని చూసి చలించిన విప్ కాపు సాంకేతిక చిక్కులు కొన్ని ఎదురైనా అధికారులను ఒప్పించి రూ.2 లక్షల వైఎస్సార్ బీమా అందేలా చర్యలు తీసుకున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం తండ్రి రూ.25 వేలు ఖర్చుచేశాడు. కొద్ది రోజుల క్రితం ఆయన కూడా మృతి చెందాడు. దీంతో విప్ కాపు ఆదేశాల మేరకు.. మిగిలిన రూ. 1.75 లక్షలకు తోడు సర్పంచ్ రాళ్ల రామలక్ష్మమ్మ, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి సొంతంగా రూ.25 వేలు అందజేసి రూ.2 లక్షల నగదును పిల్లల పేరుపై బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి మానవత్వం చాటుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి తో కలసి వారు మంగళవారం బ్యాంకు డిపాజిట్ రసీదును బాధిత కుటుంభ సభ్యులకు అందజేశారు. దీంతో గ్రామస్తులు విప్ తో పాటు సర్పంచ్, మండల, సచివాలయాల కన్వీనర్లను అభినందించారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం



కళ్యాణదుర్గం: చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎల్‌డీఓ శంకర్, ఎంఈఓ విజయకుమారి



ఉరవకొండ: రాకెట్లలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం/ఉరవకొండ/కూడేరు/కంబదూరు/గుమ్మఘట్ట/విడపనకల్లు/రాయదుర్గం రూరల్/వజ్రకరూరు/శెట్టూరు/కుందుర్పి/బొమ్మనహాళ్: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కళ్యాణదుర్గంలోని మల్లికార్జునపల్లిలో డీఎల్‌డీఓ శంకర్, ఎంఈఓ విజయకుమారి, డాక్టర్ విజయేంద్ర, పట్టణంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు తదితరులు చిన్నారులకు మాత్రలు అందజేశారు. హెచ్‌ఎం ఫల్గుణ ప్రసాద్, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఉరవకొండ మండలంలోని రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సీహెచ్‌ఓ నాగరంగయ్య, సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే కూడేరులోని కేజీబీవీలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంకే బాషా, సర్పంచ్ లలితమ్మ, కేజీబీఓ ఎస్‌ఓ ఉమాదేవి, సీహెచ్‌ఓలు మోహన్ బాబు, వరలక్ష్మి, సూపర్‌వైజర్ రవీంద్ర, వెంకటలక్ష్మమ్మ, ఏఎన్‌ఎం చంద్రకళ, ఆశావర్కర్లు పాల్గొన్నారు. అదేవిధంగా కంబదూరు మండలంలోని ఓబగానిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, ఏఎన్‌ఎం ఇందిర, అంగన్‌వాడీ టీచర్లు విజయమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుమ్మఘట్ట మండలంలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యుడు రమేష్, ఇన్‌చార్జ్ ఎంఈఓ నాగమణి తెలిపారు. సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు ఆదిబయ్యమ్మ, రవికుమార్,జయమ్మ కేంద్రాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు , ఆశావర్కర్లు పాల్గొన్నారు. విడపనకల్లు మండలంలో నిర్వహించిన ఆల్బెండజోల్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, సూపర్‌వైజర్ శర్మస్‌వలి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రాయదుర్గం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యుడు మాధవ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ నారాయణస్వామి, ప్రధానోపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వజ్రకరూరు మండలంలో నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, వైద్యాధికారి తేజశ్వి, ప్రధానోపాధ్యాయుడు నాగేందప్ప, ఏఎన్‌ఎం అరుణజ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. శెట్టూరు మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ వేణుకార్తీకేయ, ఎంఈఓ శ్రీధర్, ఈఓఆర్డీ గంగావతి, ఎస్‌ఓ లలిత, , వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కుందుర్పి మండలంలో వైద్యాధికారిణి అనూష, ఎంఈఓ ఓబుళపతి, ఎంపీపీ కమ్మలమ్మ, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండలంలో నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట వైద్యాధికారులు గీతాభార్గవి, శ్రీలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్లు యుగేంధర్, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన్, రమణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రాయదుర్గం రూరల్: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం

మంత్రిని విమర్శించే స్థాయి లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: 'ఉన్నం మారుతీ చౌదరికి మంత్రిని విమర్శించే స్థాయి లేదు. కనీసం సొంతూర్లో వార్డు సభ్యుడిగా కూడా నిలబడని ఆయన మంత్రి ఉషశ్రీ చరణ్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటు' అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, సీనియర్ నాయకుడు సుధీర్, ఎంపీపీ మారుతమ్మ, సచివాలయ కన్వీనర్లు అర్చన, ఆంజనేయులు, కిరీటి యాదవ్, కేశవ్‌గౌడ్, బసిరెడ్డి, ఉమాపతి విలేకరులతో మాట్లాడారు. గాలిమరలు, చర్చి స్థలాలను కబ్జా చేసి అనేక మంది పొట్టకొట్టిన విషయాలు గుర్తు లేదా మారుతీ అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు దిగారంటూ అధికారులే స్వయంగా మంత్రితో మాట్లాడారని అంటున్నావు.. కనీసం అక్కడ ఎవరు ఉన్నారన్నది కూడా తెలుసుకోలేని దద్దమ్మలా ఉంటే ఎలా అంటూ మండిపడ్డారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, దొంగ ఓట్లు వేయించుకోవాల్సిన దుస్థితి మాకు లేదంటూ హితవు పలికారు. ఓటుకు నోటు కేసులో టీడీపీ నేతలు అడ్డంగా దొరికినా మీకు బుద్ధి రాలేదన్నారు.

కనుల పండువగా పూల రథోత్సవం



రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కుందుర్పి: కర్ణాటకలోని వదనకల్లు గురు తిప్పేరుద్రస్వామి రథోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి పూల రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రథాన్ని స్వామి ఆలయం నుంచి కిలోమీటరు దూరం తప్పెట్లు, మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య భక్తుల సాయంతో ఊరేగించారు. చెక్క భజనలు, కీలుగుర్రాలు, వివిధ వేషధారణలతో కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.వేలాదిమంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

యువకుడి దుర్మరణం

రాయదుర్గం రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం గోనబావికి చెందిన వడ్డే మారెప్ప కుమారుడు ప్రకాష్ (24) మంగళవారం ద్విచక్రవాహనంలో బెళుగుప్ప మండలం కాలువపల్లికి బయలుదేరాడు. కదరంపల్లి సమీపంలోని టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే స్పీడ్ బ్రేకర్ వద్ద వాహన వేగాన్ని నియంత్రించే క్రమంలో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఎగిరి పొలాల్లోకి పడ్డాడు. తలకు రాయి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి సోదరుడు వడ్డే రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన దుద్దేకుంట ప్రకాష్ అనే వ్యక్తి మంగళవారం కర్ణాటక మద్యం తీసుకువస్తూ పట్టుబడ్డారని సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. అతడి నుంచి 96 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఉరవకొండ: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సచివాలయం-3 పరిధిలోని 1వ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ పనులను కోఆప్షన్ సభ్యులు పామిడి సలీం, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, సచివాలయల కన్వీనర్ ఆసీఫ్, వార్డు సభ్యులు శర్మాస్ తదితరులతో కలసి వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పట్టణంలో ఐదు సచివాలయ పరిధిలో ఇప్పటికే రూ.కోటి నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు మోమీన్ జిలాన్, సచివాలయ కన్వీనర్లు పామిడి షాహీదా, అన్వర్, చంద్ర, యూసుఫ్, పామిడి తయ్యాబ్, బాలాజీ పాల్గొన్నారు.

'ఉచిత విద్య'కు దరఖాస్తుల ఆహ్వానం

కూడేరు: జిల్లాలోని ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేయాల్సి ఉంది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో పిల్లల వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఉచితంగా విద్యా బోధన ఉంటుందని, అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు ఏపీఓ నాగరాజు (8978121004), ఏఎస్ఓ గురుమునికృష్ణ (9493419693), ఏపీఓ మారుతీ ప్రసాద్ (9866091881) నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ అనురాధ

కూడేరు: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ఏపీడీ అనురాధ సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని జల్లిపల్లిలో జరుగుతున్న కందకాల పనులు, కొర్రకోడులో జరుగుతున్న కాలువ వెడల్పు పనులను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు పనులను నాణ్యతగా చేయాలని కూలీలకు సూచించారు. మస్టర్ నమోదు పక్కాగా ఉండాలని తప్పుగా నమోదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమె కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. కూలీల సంఖ్యను ఎలా పెంచాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు షేక్షావలి, లక్ష్మీనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పశు వైద్య శిబిరం

కళ్యాణదుర్గం: పశుసంవర్ధకశాఖ, శ్రీ సత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పాపంపల్లి, మోరేపల్లిలో ఉచిత మెగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. శ్రీనివాసగుప్తా తెలిపారు. స్థానిక ఏరియా పశు వైద్యశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త పశువులకు, గొడ్డుమోతు పశువులకు వైద్యం, చూలు పరీక్షలు, పిడుదులు, గోమారి నివారణ, లేగదూడలకు నట్టల నివారణ మందులు అందజేస్తారన్నారు. అలాగే పాడి రైతులకు అవసరమైన సలహాలు, సందేహాలు నివృత్తి చేసేందుకు పశువైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. శిబిరానికి ప్రముఖ పశువైద్యులు డాక్టర్లు టీవీ సుధాకర్, పున్నయ్య, రామన్న, మంజునాథ్ హాజరవుతారన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

బెళుగుప్ప: మండలంలో 2021-22లో చేపట్టిన ఉపాధి పనులపై వారం రోజులుగా జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం నిర్వహించనున్నట్లు ఏపీఓ కృష్ణమూర్తి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో కళ్యాణదుర్గంలోని క్లస్టర్ అధికారి కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో 2021-22 మధ్య కాలంలో 2,98,789 పని దినాలకు రూ.6,81,36,000 నిధులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం పరిశీలించిందన్నారు. కార్యక్రమానికి మండల సమన్వయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు కావాలన్నారు.

రాగులపాడు సర్పంచ్‌కు పరామర్శ



సర్పంచ్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు సర్పంచు పి.శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల కూడేరు మండలం గొటుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి బెంగుళూరుకు వెళ్లి సర్పంచ్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ధైర్యంగా ఉండాలని సర్పంచ్ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సీపీ.వీరన్న, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కె.వి.రమణ తదితరులు ఉన్నారు.

పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి

కూడేరు: గాలికుంటు వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం కూడేరులో ఆయన గాలికుంటు వ్యాధిపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న పాడిపశువులకు వైరస్ ద్వారా ఈ వ్యాధి తొందరగా వ్యాప్తి చెందుతుందన్నారు. పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ నెల 31 వరకు మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలి



కూడేరు: ప్రీ ఫైనల్ పరీక్ష రాస్తున్న విద్యార్థి జవాబు పత్రాన్ని పరిశీలిస్తున్న జీసీడీఓ బేరేఖ

కూడేరు: ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా బాగా చదవాలని జీసీడీఓ బేరేఖ విద్యార్థినులకు సూచించారు. మంగళవారం ఆమె కూడేరులోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతిలో ఎంత మంది విద్యార్థినులు, ఇంటర్‌లో ఎంత మంది విద్యార్థినులు ఉన్నారని ప్రత్యేక అధికారిణి(ఎస్‌ఓ) ఉమాదేవితో ఆరా తీశారు. పదిలో 40 మంది, ఇంటర్‌లో 69 మంది విద్యార్థులున్నట్లు ఎస్‌ఓ వివరించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులకు నిర్వహిస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షను పరిశీలించారు. పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడానికి పాటించాల్సిన విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు.


గ్రామ దేవత ఉత్సవాలు

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని కల్యంలో గ్రామ దేవత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం వేకువజామున 6 గంటలకే పంచామృతాభిషేకం చేపట్టారు. బుధవారం ఉదయం 8 గంటలకు కుంబాభిషేకం నిర్వహించనున్నట్టు సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ కల్యం సురేష్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబదూరు: మండలంలోని తిమ్మాపురంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 23న ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.అర్హులైన విద్యార్థులు ఈ నెల 24 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణ శిబిరానిక ఎంపిక



ధనుంజయ

ఉరవకొండ: ఈ నెల 15, 16 తేదీల్లో న్యూఢిల్లీ వేదికగా సాగే జాతీయ స్థాయి ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణ శిబిరానికి ఏపీ తరపున ఉరవకొండకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉప్పర ధనుంజయ ఎంపికయ్యారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 75 మంది ప్రోగ్రామ్ ఆఫీసర్లను ఈ శిక్షణకు ఎంపిక చేశారు. ఇందులో ఎస్కేయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ధనుంజయకు అవకాశం దక్కింది. దీనిపై ఎస్కేయూ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ ధనుంజయను అభినందించారు.

సంక్షిప్త సమాచారం

వాహనాల వేలం రేపు

కుందుర్పి: క్రైజ్ కేసుల్లో పట్టబడిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం సెబ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. ఆసక్తి కలవారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

16,17న తపాలా ఉద్యోగుల సమ్మె

కంబదూరు: గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16,17న సమ్మె చేపడుతున్నట్లు ఆ సంఘం నాయకులు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, మల్లేశయ్య, గంగాధర్, బెన్నమిన్, వాజిర్ బాషా, మాధవి, అనిత, దేవరాజు, రఘు,గౌస్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు వారు సమ్మె నోటీసును పోస్టుమాస్టర్‌కు అందజేశారు.

ముగిసిన జాఫర్‌షావలి ఉరుసు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కొండపై వెలసిన హజ్రత్ సయ్యద్ జాఫర్ షావలి 305వ ఉరుసు మంగళవారం ముగిసింది. రెండురోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో సోమవారం దర్గాలో ప్రత్యేక ఫాతెహా, సందల్ కార్యక్రమం జరిగింది. చివరి రోజు మంగళవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగిసింది. కులమతాలకు అతీతంగా భక్తులు హాజరై పూజలు చేసి, చాదర్‌లు సమర్పించి చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొన్ని అనివార్య కారణాలతో ఈ సారి షంషీర్ ఉత్సవాన్ని నిర్వహించలేకపోయామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు మంజూర్‌ఖాద్రి, పీరా, రియాజ్, రఫీక్, సర్మాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల ప్రారంభం

కుందుర్పి: మండల కేంద్రంలోని మైనార్టీ కాలనీలో మంగళవారం ఎంపీడీఓ నారాయణస్వామి, సర్పంచ్ మారుతేశ్వని, పంచాయతీ కార్యదర్శి మహమద్‌బాషా ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కుందుర్పి కొండ పరిసర ప్రాంతాల్లోని మురుగునీరంతా రోడ్లపై ప్రవహించడంతో పాటు ఆంజనేయస్వామి ఆలయం ఉండడం వల్ల భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతనంగా డైనేజీని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. మైనార్టీ కాలనీతో పాటు కురుబ, బోయ వీధుల్లో సైతం డైనేజీ ఏర్పాటు చేసి పారిశుద్ధ్యం మెరుగుపరచనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

గోదాము నిర్మాణం ప్రారంభం

వజ్రకరూరు: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గోదాము నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రూ. 32 లక్షల వ్యయంతో గోదామును నిర్మిం చనున్నారు. ప్రస్తుతం ప్లాట్‌ఫాం నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ గోదాము నిర్మాణంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వజ్రకరూరు పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఎరువులు, విత్తనాలు తదితర వాటిని కూడా గోదాములో ఉంచి రైతులకు అందజేస్తామన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

కూడేరు: మండల కేంద్రంలో ఉన్న విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాలన్నింటికీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ గౌస్ మంగళవారం తెలిపారు. పి.నాగిరెడ్డిపల్లి ఫీడర్ చానల్ విద్యుత్ లైన్‌కు మరమ్మతుల నేపథ్యంలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.